క్లుప్తంగా

వైభవంగా సామూహిక కుంకుమ పూజలు


సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్న భక్తులు

గజపతినగరం: మండల కేంద్రంలోని శివాలయ గ్రూపు దేవాలయాల్లో వెలసిన సాయిబాబా మందిరంలో ఆదివారం సాయంత్రం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. శ్రావణమాసం ఆఖరి రోజు కావడంతో కుంకుమ పూజల్లో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. అర్చకుడు శ్రీనివాసాచార్యులు భక్తుల గోత్రనామాలతో పూజలు జరిపించారు.

ముగిసిన పవిత్రోత్సవాలు


స్వామివారికి అభిషేకంచేస్తున్న అర్చకులు

జామి: పుష్పగిరి గ్రామంలోని పురాతన వేణుగోపాలస్వామి ఆలయంలో గతనెల 28న ప్రారంభమైన పవిత్రోత్సవాలు ఆదివారంతో ము గిశాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు ఫణిహారం సీతారామచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి అవబృదస్నానం, అభిషేకాలు చేసి విశేషంగా అలంకరించారు. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

వాహన తనిఖీలు


వాహన తనిఖీలు చేస్తున్న ఎస్‌ఐ లోకేశ్వరరావు

మెరకముడిదాం: మండల కేంద్రంతో పాటు సోమలింగాపురం జంక్షన్ వద్ద బుధరా యవలస ఎస్‌ఐ బి.లోకేశ్వరరావు, పోలీసులు ఆదివారం వాహన తనిఖీలు చేశారు. గంజాయి అక్రమ రవాణాను అడ్డుకునేందుకు పోలీసులు వాహన తనిఖీలు ముమ్మురం చేశారు. అందులో భాగంగానే పోలీసులు ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అలాగే వాహన పత్రాలను, వాహన చోదకుల లైసెన్స్ పరిశీలించారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు.

గరివిడిలో శాంతి ర్యాలీ


యుద్ధాలు ఆపాలంటూ శాంతి ర్యాలీ చేపడుతున్న సీఐటీయూ నాయకులు

చీపురుపల్లి రూరల్ (గరివిడి): పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ఆపి ప్రపంచ శాంతికి సహకరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో గరివిడిలో ఆదివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. ప్రపంచ కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, రాష్ట్ర నాయకుడు టీవీ రమణ, జిల్లా అధ్యక్షుడు శంకరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.గౌరినాయుడు, ఆశా వర్కర్స్ సంఘ ప్రధాన కార్యదర్శి బి.సుధారాణి పాల్గొన్నారు.

ఎరువులు అందుబాటులో ఉంచండి

వేపాడ: వర్షాలు కురుస్తున్నందున వరి పంటకు అవసరమైన ఎరువులను గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని ఏపీ రైతు సంఘం జిల్లా నాయకుడు చల్లా జగన్ అధికారులను కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున రైతులు కలుపు తీత చేపడుతున్నారని, కలుపు తీత అనంతరం ఎరువులు వేస్తారని, అధికారులు స్పందించి ఎరువులు కొరత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

10 నుంచి 'పొలం పిలుస్తోంది'

గజపతినగరం: మండలంలో ఈనెల 10వ తేదీ నుంచి 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించనున్నట్లు గజపతినగరం ఏడీఏ కె.మహరాజన్ ఆదివారం ఓప్రకటనలో తెలిపారు. 10వ తేదీ నుంచి నవంబర్ నెలాఖరు వరకు ప్రతీ మంగళ, బుధవారాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు. 10వ తేదీన ఉదయం పాతభగ్గాం గ్రామంలో, మధ్యాహ్నం కొత్తభగ్గాంలో ఈ కార్య క్రమం ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. రైతుసేవా కేంద్రాల వద్ద నిర్వహించనున్న ఈకార్యక్రమాల్లో వ్యవసాయ శాఖతో పాటు అనుబంధ పశుసంవర్ధక శాఖ, మత్స్యశాఖ, మార్కెటింగ్, ఉద్యాన వన, పట్టు పరిశ్రమ శాఖ, ఆత్మవిభాగం ప్రతినిధులతో పాటు శాస్త్రవేత్తలు పాల్గొంటారని పేర్కొన్నారు. వ్యవసాయ అనుబంధ శాఖల ద్వారా అందుతున్న పథకాలు, సమగ్రవ్యవసాయ యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలపై రైతులక అవగాహన కల్పిస్తామని తెలిపారు.

రైతు బజార్ల నిర్మాణం జరిగేనా..?

- గత ప్రభుత్వ హయాంలో రైతు బజార్ల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్
- ఒక్కో బజార్‌కు రూ.75 లక్షల నిధులు మంజూరు
- ప్రభుత్వం మారడంతో మధ్యలో నిలిచిపోయిన పనులు


చీపురుపల్లిలో నిలిచిపోయిన రైతుబజార్ నిర్మాణ పనులు

చీపురుపల్లి: రైతులు తాము సాగు చేసిన కూరగాయల పంటలను నష్టం లేకుండా సరైన ధరలకు విక్రయించుకునేందుకు....వినియోగదారులకు నాణ్యమైన తాజా ఉత్పత్తులు సరసమైన ధరలకు లభించే చోటు రైతుబజార్. అలాంటి రైతుబజార్ల నిర్మాణానికి గత ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతీసుకుంది. పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన వినియోగదారులకు అందుబాటులో రైతుబజార్లు ఏర్పాటు చేయాలని చర్యలు చేపట్టింది. నియోజకవర్గంలోని చీపురుపల్లి, గరివిడి మండల కేంద్రాల్లో వీటి నిర్మాణానికి గత ప్రభుత్వంలో గ్రీన్ సిగ్నల్ పడింది. ఒక్కో బజార్‌కు రూ.75 లక్షల మార్కెట్‌యార్డు నిధులను మంజూరు చేశారు. చీపురుపల్లిలో రైతు బజార్‌కు తహసీల్దార్ కార్యాలయానికి వెనుక భాగంలో, గరివిడిలో రైతుబజార్‌కు పోలీస్‌స్టేషన్, ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల ఎదురుగా లయన్స్ కంటి ఆస్పత్రి వద్ద ప్రభుత్వ స్థలాలను కేటాయించడంతో పనులు ప్రారంభించారు. చీపురుపల్లిలో 70 శాతం వరకు పనులు పూర్తయ్యాయి. గరివిడిలోని రైతుబజార్ పనులు పునాదుల దశలో ఉన్నాయి. ప్రభుత్వం మారడంతో ఈ పనులు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వంలో రైతుబజార్లు అందుబాటులోకి వస్తాయనే ఆశలు అడియాశలుగానే మిగిలిపోనున్నాయనే చర్చ జరుగుతోంది. కూటమి అధికారంలోకి వచ్చి మూడు నెలలు కావస్తున్నప్పటికీ ఇంతవరకు ప్రజలకు ఉపయోగపడే ఎలాంటి పనులుపై స్థానికంగా ఉండే పాలకులు సైతం దృష్టి సారించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

రైతులకు ఎంతో ప్రయోజనం

రైతుబజార్ల నిర్మాణం పూర్తయితే నియోజకవర్గంలో కూరగాయల పంటలు సాగుచేస్తున్న రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. చీపురుపల్లి మండలం లోని కూరాకులవీధి, రావివలస, రామలింగాపురం, రెడ్డిపేట, మెట్టపల్లి, విజయరాంపురం, అలజంగి, పర్ల, పేరిపి, ఇటకర్లపల్లి గ్రామాలు, గరివిడి మండలంలోని కాపుశంభాం, బొండపల్లి, ఎం.దుగ్గివలస, గడబవలస, శేరీపేట, దుమ్మెద, కోనూరు, అర్థమూరు గ్రామాలతో పాటు మెరకముడిదాం మండలంలోని పలు గ్రామా ల్లో రైతులు కూరగాయలు పంటలను పండిస్తుంటారు. వారంతా రోజూ నియోజకవర్గ కేంద్రమైన చీపురుపల్లికి పంటలు తీసుకొచ్చి దళారులకు అమ్ముకోవాల్సి వస్తోంది. అదే రైతుబజార్లు ఉంటే అక్కడే పంటలు విక్రయించుకునే అవకాశం ఉంటుంది. రైతులకు నేరుగా ప్రయోజనం చేకూరుతుంది. అలాగే రైతు బజార్లు అందుబాటులోకి వస్తే వినియోగదారులకు కూడా మేలు చేకూరనుంది. తాజా కూరగాయలు తక్కువ ధరలకే లభించే అవకాశం ఉంది. అందుకే రైతుబజార్ నిర్మాణాల పనులు త్వరితగతిన పూర్తి చేయాలని రైతులు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

తుఫాన్‌పై అప్రమత్తంగా ఉండాలి


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న తహసీల్దార్ ప్రసాదరావు

లక్కవరపుకోట: తుఫాన్ నేపథ్యంలో మరో రెండు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో మండల అధికారులు అంతా అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ప్రసాదరావు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు, వీఆర్‌ఓలతో ఆదివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎక్కడా తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని, ఇప్పటికే గుర్తించిన ముంపు ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని, గండికొట్టే అవకాశం ఉన్న చెరువులను గుర్తించి, గండి కొట్టకుండా నిలువరించే మార్గా లను చూడాలని చెప్పారు. గ్రామాల్లో వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు అప్రమత్తంగా ఉంటూ ఎప్పటికప్పుడు సమాచారాన్ని తహసీల్దార్ కార్యాలయానికి చేరవేయాలని సూచించారు. ఎంపీడీఓ కె.రూపేష్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త బొద్దాంలో వైద్యశిబిరం


శిబిరంలో వైద్యసేవలందిస్తున్న డాక్టర్ రమాదేవి

వేపాడ: కొత్త బొద్దాం గ్రామంలో బొద్దాం పీహెచ్‌సీ వైద్యాధికారి రమాదేవి ఆధ్వర్యంలో ఆదివారం వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో 62 మందికి వివిధ వైద్యపరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నం దున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కాచిన నీటిని తాగాలని, వేడి ఆహార పదార్థా లను తీసుకోవాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, నివాస పరిసరాల్లో మురుగు నీరు నిల్వలేకుండా చూసుకోవాలని చెప్పారు. హెల్త్ సూపర్ వైజర్ మూర్తి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గురుదేవా చారిటబుల్ ట్రస్ట్‌కు సహకారం

- విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్‌భట్


కృత్రిమ అవయవాల తయారీ యూనిట్‌ను పరిశీలిస్తున్న సీఎండీ అతుల్‌భట్

కొత్తవలస: దివ్యాంగులకు కొత్త జీవితాలను ప్రసాదిస్తున్న మండలంలోని మంగళపాలెం గ్రామ సమీపంలో గల గురుదేవా చారిటబుల్ ట్రస్టుకు తన పూర్తి సహకారం అందజేస్తానని విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ సీఎండీ అతుల్‌భట్ తెలిపారు. ట్రస్ట్ కార్యాలయాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సేవలు, నూతనంగా ప్రారంభం కానున్న క్యాన్సర్ ఆస్పత్రి భవనాలు, దివ్యాంగులకు అందించేందుకు తయారు చేస్తున్న కృత్రిమ అవయవాల యూనిట్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా కృత్రిమ అవయవాల తయారీ విధానంపై ట్రస్ట్ చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు ఆయనకు వివరించారు. దక్షిణ భారతదేశంలోనే అత్యంత నాణ్యమైన, తేలికైన కృత్రిమ అవయవాలు తయారు చేస్తున్న ఏకైక సంస్థ గురుదేవా చారిటబుల్ ట్రస్టు అని తెలిపారు. కార్యక్రమంలో స్టీల్ ఎక్స్ఛేంజ్ ఇండియా లిమిటెడ్ కర్మాగారం ఎం.డి సురేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ విగ్రహావిష్కరణ

మెరకముడిదాం: మండల కేంద్రంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల డిప్యూటీ కో–ఆర్డినేటర్, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు సోమవారం ఆవిష్కరించనున్నారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కె.ప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇక్కడ ఇదివరకు ఉన్న వైఎస్సార్ విగ్రహంపై చెట్టుకొమ్మ పడిపోవడంతో పాడైందని, విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్మన్ ఆవిగ్రహం స్థానంతో కొత్తది ఏర్పాటు చేసేందుకు తన సొంత ఖర్చులతో అనకా పల్లిలో విగ్రహం చేయించి తీసుకువచ్చారని పేర్కొన్నారు. కార్యక్రమానికి మండల వైఎస్సార్‌సీపీ నాయకులు అంతా హాజరు కావాలని కోరారు.

రక్త పరీక్షలు చేయించుకోవాలి..

- డాక్టర్ మహేంద్రగిరి

గంట్యాడ : మూడు రోజులకు మించి జ్వరం ఉన్నా, చిగుళ్ల నుంచి రక్తస్రావం జరుగుతున్నా వెంటనే వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని డాక్టర్ మహేంద్రగిరి అన్నారు. మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో గ్రామీణ వైద్యుల సంఘ సభ్యులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత సీజన్‌లో మలేరియా, డెంగీ కేసులు ఎక్కువగా కనిపిస్తున్నాయని చెప్పారు. రోగులు అశ్రద్ధ వహించకుండా చైతన్య పరచాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ జయశంకర్ కృష్ణ, గ్రామీణ వైద్యుల సంఘ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గెద్ద చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఆదిభట్ల ఆరాధనోత్సవాలు

- బొంతలకోటికి హరికథా చూడామణి బిరుదు
- సాహితీ సంస్థలకు ప్రోత్సాహం : నగర డిప్యూటీ మేయర్ శ్రావణి

విజయనగరం టౌన్: హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు ఆరాధనోత్సవాలు స్థానిక లేడీస్ రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో రెండో రోజైన ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం మండా వరలక్ష్మి భాగవతారిణి రుక్మిణీ కల్యాణం హరికథ ఆద్యంతం ఆకట్టుకుంది. సాయంత్రం ఆదిభట్ల రవి భాగవతార్ పార్వతీపరిణయం హరికథ రక్తి కట్టించింది. అనంతరం రాత్రి నిర్వహించిన సభా కార్యక్రమానికి నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సాహితీ సంస్థలకు తమ కుటుంబం చేస్తున్న సేవ ఎనలేనిదన్నారు. నాటికి, నేటికీ ఎప్పటికీ నిరంతరాయంగా తమ సహాయ, సహకారాలను అందజేస్తూనే ఉంటుందన్నారు. అనంతరం విశాఖకు చెందిన బొంతలకోటి యతిరాజు భాగవతార్‌కు హరికథా చూడామణి బిరుదుతో ఘనంగా సత్కరించారు. అనంతరం పురస్కార గ్రహీత నిర్వహించిన భక్త ధృవ కథాగానం ఆద్యంతం ఆహూతులను అలరించింది. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ.గోపాలరావు, డాక్టర్ వై.బాబూరావు, పువ్వాడ సత్య వెంకట భాస్కర్, కోలపల్లి ధర్మశ్రీరామబాబా, రంగారావు దొర, భోగరాజు సూర్యలక్ష్మి, కాళ్ల నిర్మల పాల్గొన్నారు.

ఉద్యోగభద్రత కల్పించండి..


ఎస్.కోటలో ర్యాలీ చేస్తున్న మద్యం దుకాణాల ఉద్యోగులు

శృంగవరపుకోట: ఐదేళ్లుగా ప్రభుత్వం అప్పగించిన బాధ్యతలను నిర్వహిస్తున్నాం.. తాజాగా మద్యం విధానాలు మార్చి మా జీవితాలతో ఆటలాడుకోవద్దని, తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న సిబ్బంది కోరారు. ఈ మేరకు పట్టణ ప్రధాన రహదారిలో ఆదివారం నిరసన ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు సుమారు వంద మంది కె.ప్రభు, సీహెచ్ ఈశ్వరరావు, పొట్నూరు శ్రీను, గౌరినాయుడు, కె.శంకరరావు, ఎం.మల్లికార్జునరావుల నేతృత్వంలో స్థానిక దేవీ జంక్షన్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ, గత ప్రభుత్వం హయాంలో చిత్తశుద్ధితో పనిచేసిన తాము ప్రస్తుత ప్రభుత్వ నిర్ణయాల మేరకు పనిచేస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 15 వేల మంది ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్నారని, వారందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం


రక్తదానం చేస్తున్న యువకులు

కొత్తవలస: రక్తదానం ప్రాణదానంతో సమానమని, రక్తదానం ఒక గొప్ప సామాజిక సేవా కార్యక్రమమని కొత్తవలస సీఐ సీహెచ్.షణ్ముఖరావు అన్నారు.మండల కేంద్రంలో కొత్తవలస మండల యువత ఆధ్వర్యంలో విశాఖపట్నం రోటరీ బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో ఆదివారం ఏర్పాటు చేసిన రక్తదానశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. శిబిరంలో వివిధ గ్రామాలకు చెందిన 40 మంది యువకులు రక్తందానం చేశారు. ఈసందర్భంగా శిబిరం నిర్వాహకులు మాట్లాడుతూ కోల్‌కతాలో అత్యాచారం, హత్యకు గురైన ట్రైనీ వైద్యురాలికి సంతాపంగా రక్తదాన శిబిరం నిర్వహించామని చెప్పారు. సీఐతో పాటు రోటరీ బ్లడ్ బ్యాంక్ డాక్టర్ వి.అశోక్‌కుమార్ మాట్లాడుతూ అపోహలు వీడి ఆరోగ్యంగా ఉన్న 18 నుంచి 65 ఏళ్ల లోపు ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం రక్తదాతలకు సర్టిఫికెట్‌లు అందజేశారు.

నేడు వైఎస్సార్ వర్ధంతి

శృంగవరపుకోట: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని నియోజకవర్గంలో సోమవారం నిర్వహించనున్నట్టు మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటలకు కొత్త వలస జంక్షన్‌లో, 10 గంటలకు ఎస్.కోటలోని దేవీ జంక్షన్‌లో కార్యక్రమాలు నిర్వహిస్తామని, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, హాజరు కావాలని కోరారు.

చీపురుపల్లిలో..

చీపురుపల్లి: దివంగత మహానేత వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి వర్ధంతిని సోమవారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఇప్పిలి అనంతం , పార్టీ జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివా సనాయుడు ఆదివా రం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించనున్నట్లు పే ర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర డిప్యూటీ కో–ఆర్డినేటర్, జిల్లా పార్టీ అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ హాజరు కానున్నట్లు తెలిపారు.

గజపతినగరంలో..

గజపతినగరం: మండల కేంద్రంలో వైఎస్సార్ వర్ధంతిని సోమవారం నిర్వహిస్తామని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జాతీయ రహదారి వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య పూలమాలలు వేసి నివాళులర్పించనున్నారని పేర్కొన్నారు. మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

ఆర్.రామచంద్రాపురంలో..

దత్తిరాజేరు: మండలంలోని ఆర్. రామచంద్రాపురంలో వైఎస్సార్ వర్ధంతి నిర్వహించనున్నామని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాపాక కృష్ణమూర్తి ఆదివారం తెలిపారు. ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు, జెడ్పీటీసీ రాతు రాజేశ్వరి వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి నివాళులర్పిస్తారని, మండల నాయకులంతా హాజరు కావాలని కోరారు.

జామిలో..

జామి: మండల కేంద్రంలో కొత్తలివీధిలోని వైఎస్సార్ విగ్రహం వద్ద ఉదయం 9 గంటలకు వైఎస్సార్ వర్ధంతిని సోమవారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొర్లె రవికుమార్ ఆదివారం తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

వేపాడలో..

వేపాడ: మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద ఉదయం 9గంటలకు వైఎస్సార్ వర్ధంతిని నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ముమ్మలూరి జగ్గుబాబు తెలిపారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు హాజరు కావాలని కోరారు.

ఆత్మీయ హిందూ సమ్మేళనం..


మాట్లాడుతున్న హిందు పరిషత్ జిల్లా ధర్మ ప్రచార్ సంయోజిక్ సూర్యనారాయణ

మెరకముడిదాం: హిందుత్వాన్ని ప్రతి హిందువూ బలోపేతం చేయాలని వీహెచ్‌పీ చీపురుపల్లి నియోజకవర్గ ధర్మప్రచార్ సంయోజిక్ పి.సూర్యనారాయణ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని శివాలయంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం ఆత్మీయ హిందూ సమ్మేళనం నిర్వహించారు. సమావేశంలో వీహెచ్‌పీ సభ్యులు నాగభూషణరావు, శ్రీనివాసరావు, ప్రేమ్‌కుమార్, తదితరులు మాట్లాడుతూ.. హిందువులంతా ఒకతాటిపై నిలవాలన్నారు. ప్రతి హిందువూ దైవత్వం గురించి తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో కేఎస్‌ఆర్‌కే ప్రసాద్, కె.గురురాజు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై గోతుల పూడ్చివేత


పెదమానాపురంలో తాత్కాలిక జాతీయ రహదారిపై గోతులు పూడ్చి వేయిస్తున్న ఎస్‌ఐ జయంతి

దత్తిరాజేరు: పెదమానాపురంలో నిర్మాణంలో ఉన్న రైల్వే వంతెన పక్క నుంచి ఏర్పాటు చేసిన తాత్కాలిక జాతీయ రహదారిపై గోతులను పెదమానాపురం ఎస్‌ఐ జయంతి ఆదివారం క్రషర్ బుగ్గితో పూడ్చి వేయించారు. ఇదివరకే గోతులు తేలిన రోడ్డు రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అధ్వానంగా తయారైంది. గోతుల్లో నీరు చేరి బురదమయం కావడంతో స్థానికులు, వాహన చోదకులు ఎస్‌ఐ జయంతికి సమస్యను తెలియజేశారు. ఆమె వెంటనే స్పందించి వంతెన నిర్మాణ కాంట్రాక్టర్‌తో మాట్లాడి రైల్వే గేట్‌కు ఇరువైపులా కిలోమీటర్ దూరంలో ఉన్న గోతులను క్రషర్ బుగ్గితో కప్పి వేయించారు.

సంతోషిమాత ఆలయంలో చండీహోమం


ప్రత్యేక అలంకరణలో సంతోషిమాత


చండీహోమం నిర్వహిస్తున్న అర్చకులు

విజయనగరం టౌన్: పట్టణంలోని మయూరి కూడలి వద్దనున్న సంతోషమాత ఆలయంలో ఆదివారం చండీహోమం ఘనంగా నిర్వహించారు. ఇటీవల 1100 కిలోల పసుపు కొమ్ములతో సహస్రకుంకుమార్చన చేసి వాటిని ఆలయ ఆవరణలో భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రాకపోకలకు ఇక్కట్లు


రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నిలిచిన నీటిలో వాహనదారుల ఇక్కట్లు

కొత్తవలస: వర్షం కురిస్తే మండల కేంద్రంలోని రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు నానా అవస్థలు పడాల్సి వస్తోంది. కొత్తవలస– డాబాల ప్రాంతం మధ్య గతంలో రైల్వే గేటు ఉండేది.ఈ గేటును తొలగించి గతేడాది రైల్వే అధికారులు అండర్ బ్రిడ్జిని నిర్మించారు. వర్షాలకు ఈ బ్రిడ్జి కింద నీరు నిల్చిపోతుండడంతో రాకపోకలకు వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం నడిచి వెళ్లేందుకు కూడా అవకాశం లేకుండా పోతోంది. నడుము లోతులో నీరు నిలిచిపోతోంది. బ్రిడ్జి కింద చేరిన నీటిని బయటకు పంపించే మార్గాలను రైల్వే అధికారులు కల్పించలేదు. నీటిలో నుంచి రాకపోకలు సాగిస్తుండడం వల్ల ద్విచక్ర వాహనాలు పాడవుతున్నాయని వాహన చోదకులు వాపోతున్నారు. రైల్వే అధికారుల తీరుపై పలువురు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.ఈ బ్రిడ్జి నిర్మాణం వల్ల కొత్తవలస జంక్షన్‌లో కూడా నీరు నిలిచిపోతోందని, సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.

డ్రగ్స్ సరఫరా చేస్తే కఠిన చర్యలు

- డీఎస్పీ గోవిందరావు


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎస్పీ గోవిందరావు

డెంకాడ: డ్రగ్స్ సరఫరా చేసినా, విక్రయించినా చర్యలు కఠినంగా ఉంటాయని విజయనగరం డీఎస్పీ గోవిందరావు అన్నారు. మండలంలోని బొడ్డవలసలో ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు ఆరోగ్యానికి చాలా హానికరమన్నారు. ఇలాంటి నిషేధిత మత్తు పదార్థాలు రవాణా చేసినా, విక్రయించినా చట్టప్రకారం శిక్ష తప్పదని హెచ్చరించారు. అలాగే వాహనచోదకులు తప్పనిసరిగా రహదారి భద్రతా నిబంధనలు పాటించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. వినాయక ఉత్సవాలు నిర్వహించాలనుకునేవారు పోలీస్ అనుమతి పొందాలన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై సన్యాసినాయుడు, తదితరులు పాల్గొన్నారు.